

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 05-09-2026 సంపుటి : 08 సంచిక 78 పేజీలు : 8 వెల : రూ 3-00

## సీఎం చంద్రబాబు అధ్యక్షతన రెండు రోజుల పాటు కలెక్టర్ల కాన్ఫరెన్స్




అమరావతి, సెప్టెంబర్ 4, : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 8వ కలెక్టర్ల సదస్సు నిర్వహించడానికి సర్వం సిద్ధమైంది. ఈ నెల 10, 11వ తేదీల్లో ఈ సదస్సు జరగనుంది. రెండు రోజుల పాటు నిర్వహించనున్న కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు పలు కీలక అంశాలపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేయనున్నారు. తొలి రోజు గత సదస్సు నిర్ణయాల అమలుపై సమీక్షించనున్నారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధి, జిల్లా వారీ లక్ష్యాలపై కలెక్టర్లు ప్రెజెంటేషన్ ఇవ్వనున్నారు. స్వర్ణ ఆంధ్ర?2047 జిల్లా రోడ్‌మ్యాప్‌లపై ప్రత్యేకంగా సీఎం చంద్రబాబు చర్చించనున్నారు. సూపర్ సిక్స్, సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించనున్నారు. ఆరోగ్యం, విద్యాశాఖ పనితీరుపై కలెక్టర్లతో సీఎం చంద్రబాబు చర్చించనున్నారు. పెట్టుబడులు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై మాట్లాడనున్నారు. జలధార కార్యక్రమం పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. జిల్లా కలెక్టర్ల ఉత్తమ ఆవిష్కరణలకు ప్రత్యేక ప్రదర్శన, వివరణ ఇవ్వనున్నారు. రెండో రోజు ఈ-గవర్నెన్స్, ఖీఉ ా, ఖఉఖీ పనితీరుపై ముఖ్యమంత్రి సమీక్షించనున్నారు. భూ పరిపాలన, కేంద్ర పథకాల నిధుల వినియోగంపై చర్చించనున్నారు. జిల్లా కలెక్టర్లతో ఓపెన్ ఫోరంలో క్షేత్రస్థాయి సమస్యలపై మాట్లాడనున్నారు. చివరి రోజు శాంతిభద్రతల సమీక్షతో పాటు ముగింపు ప్రసంగాన్ని సీఎం చంద్రబాబు చేయనున్నారు.

## విశ్వాసానికి ప్రతిబింబం.. మెలోనికి మోదీ అభినందనలు



ఢిల్లీ, సెప్టెంబర్ 4: ఇటలీ రాజకీయ చరిత్రలో ప్రధాని జార్జియా మెలోని నూతన అధ్యాయాన్ని లిఖించారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఇటలీలో అత్యంత సుదీర్ఘకాలం పాటు నిరంతరాయంగా పాలించిన ప్రధానమంత్రిగా ఆమె రికార్డు సృష్టించారు. 1,413 రోజుల పాటు నిరంతరంగా పదవిలో కొనసాగడం ద్వారా, గతంలో సిల్వియో బెర్లుస్కోనీ నేతృత్వంలోని ప్రభుత్వం (2001-2005) పేరిట ఉన్న 1,412 రోజుల రికార్డును మెలోని దాటేశారు. ఈ చరిత్రాత్మక విజయం సాధించిన సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనికి సోషల్ మీడియా వేదికగా (చీ) ప్రత్యేక అభినందనలు తెలిపారు. 'ఇటలీ యుద్ధానంతర చరిత్రలో అత్యధిక కాలం నిరంతరాయంగా పనిచేసిన ప్రధానమంత్రిగా నిలిచిన నా మిత్రురాలు, ప్రధానమంత్రి మెలోనికి అభినందనలు. ఈ మైలురాయి ఆమె నాయకత్వంపై ఇటలీ ప్రజలకు ఉన్న నమ్మకానికి, విశ్వాసానికి ప్రతిబింబం' అని ప్రధాని మోదీ చీలో పోస్ట్ చేశారు. దౌత్య, ఆర్థిక సంబంధాలను బలోపేతం చేయడంలో మెలోని వ్యూహాత్మక సహకారాన్ని నొక్కిచెబుతూ ప్రధాని మోదీ.. 'భారత్-ఇటలీ ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ఆమె స్నేహం కూడా కీలక పాత్ర పోషించింది. మన ఇరు దేశాల ప్రజల కోసం ఒక సుసంపన్నమైన భవిష్యత్తును నిర్మించడానికి, మన సన్నిహిత సహకారాన్ని కొనసాగించడానికి ఎదురుచూస్తున్నాను'. రాబోయే సంవత్సరాల్లో ఆమె నిరంతర విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నానని మోదీ తన శుభాకాంక్షల సందేశంలో పేర్కొన్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత గత 80 ఏళ్లలో దాదాపు 68 ప్రభుత్వాలు మారిన ఇటలీ రాజకీయాల్లో, ఒక ప్రభుత్వం పూర్తికాలం స్థిరంగా కొనసాగడం అత్యంత అరుదైన విషయం. అటువంటి రాజకీయ వాతావరణంలో అక్టోబర్ 2022లో ఇటలీ తొలి మహిళా ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మెలోని, అత్యంత స్థిరమైన పాలనను అందిస్తూ ఈ మైలురాయిని చేరుకున్నారు.

## రాజమండ్రి కాలుష్యంలో సగం ఆ పరిశ్రమే కారణం= పవన్



రాజమండ్రి, సెప్టెంబర్ 4 రాజమండ్రిలోని ఆంధ్ర పేపర్ లిమిటెడ్ (ఏపీఎల్) తీరుపై రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పుష్కర కాలంగా పన్నులు ఎగవేస్తూ, మరోవైపు గోదావరి నదిని తీవ్రంగా కలుషితం చేస్తూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందని ఆయన విరుచుకుపడ్డారు. రాజమండ్రిలో సగం కాలుష్యానికి ఈ కంపెనీయే కారణమని ఆరోపించారు. పద్ధతి మార్చుకోకపోతే పరిశ్రమ కార్యకలాపాలను నిలిపివేయడం దగ్గర నుంచి లైసెన్సు రద్దు వరకు ఎలాంటి కఠిన చర్యలకైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు కంపెనీకి షోకాజ్ నోటీసులు జారీ చేసి, తక్షణమే చర్యలు చేపట్టాలని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులను ఆదేశించారు. 2016 నుంచి కాతేరు గ్రామ పంచాయతీకి గానీ, రాజమండ్రి నగరపాలక సంస్థకు గానీ ఆంధ్ర పేపర్ మిల్లు ఒక్క రూపాయి కూడా పన్ను చెల్లించలేదని పవన్ కల్యాణ్ ఆరోపించారు. స్థానిక సంస్థలకు సుమారు రూ. 21.34 కోట్ల మేర పన్నులు బకాయిపడిందని ఆయన తెలిపారు. పన్ను చెల్లించాలని అధికారులు నోటీసులు జారీ చేసిన ప్రతిసారీ, యాజమాన్యం కోర్టులను ఆశ్రయించి జాప్యం చేస్తోందని, బాధ్యత నుంచి తప్పించుకుంటోందని మండిపడ్డారు. ప్రభుత్వంతో సంబంధం లేకుండా సొంతంగా పన్ను మినహాయింపు ఇచ్చుకున్నారా? అని ఆయన నిలదీశారు. అధికారిక గణాంకాల ప్రకారమే రాజమండ్రి నగరంలోని మొత్తం కాలుష్యంలో సగం ఆంధ్ర పేపర్ మిల్లు నుంచే వస్తోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. నగరం మొత్తం మీద రోజుకు 70 మిలియన్ లీటర్ల ద్రవ వ్యర్థాలు ఉత్పత్తి అయితే, ఒక్క ఆంధ్ర పేపర్ మిల్లు నుంచే 35 మిలియన్ లీటర్ల వ్యర్థాలు వెలువడుతున్నాయని వివరించారు. ఈ వ్యర్థ జలాల్లో ప్రమాదకర రసాయనాలు నిర్దేశిత పరిమితికి మించి ఉన్నాయని పరీక్షల్లో తేలిందన్నారు. లాగూన్ల వద్ద సేకరించిన నీటి నమూనాల్లో బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీఓడీ) లీటరుకు 36 మిల్లీగ్రాములుగా ఉందని, ఇది ప్రమాణాల కన్నా 20 శాతం అధికమని తెలిపారు. అదేవిధంగా ఫాస్ఫేట్ 6 శాతం, సల్ఫైడ్‌లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రమాణాల కన్నా ఏకంగా 70 శాతం అధికంగా ఉన్నాయని ఆయన వెల్లడించారు. పరిశ్రమ విడుదల చేస్తున్న కాలుష్యం వల్ల గోదావరి నీటిలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గి జలచరాల మనుగడకు ముప్పు వాటిల్లుతోందని, నది సహజ పర్యావరణ వ్యవస్థ దెబ్బతింటోందని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. దుర్వాసన, నీటి నాణ్యత క్షీణతతో ప్రజారోగ్యానికి హాని కలుగుతోందని, భవిష్యత్ తరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని అన్నారు. గతంలో తాను క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు భూగర్భ జలాలు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించినా, యాజమాన్యం పట్టించుకోలేదని గుర్తుచేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్నందున పరిశ్రమ కార్యకలాపాలను నిలిపివేయడం, జరిమానాలు విధించడం, కంపెనీని సీజ్ చేయడం, లైసెన్సును రద్దు చేయడం వంటి కఠిన చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. అయితే, పరిశ్రమలను ఇబ్బంది పెట్టకూడదనే ఉద్దేశంతోనే సంకీర్ణ ప్రభుత్వం ముందుగా షోకాజ్ నోటీసులు జారీ చేసి, తప్పు సరిదిద్దుకునే అవకాశం ఇచ్చిందని తెలిపారు. గత మూడు నెలలుగా పీసీబీ అధికారులు సంస్థ ప్రతినిధులతో పలుమార్లు చర్చించినా స్పందన కరువైందని అన్నారు. ఈ నేపథ్యంలో తక్షణమే సమన్లు జారీ చేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇలాంటి కేసుల విచారణను వేగవంతం చేసేలా చూడాలని అడ్వకేట్ జనరల్, అదనపు ఏజీ, ఇతర ప్రభుత్వ న్యాయవాదులకు సూచించారు. 'స్వచ్ఛ గోదావరి - పవిత్ర పుష్కరాలు' నినాదంతో గోదావరి పరిరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు పర్యావరణవేత్తలు, పౌర సమాజం మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ప్రజల ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణకే తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

## గోవా గవర్నర్ స్థల వివాదంపై విచారణకు ఏపీ ప్రభుత్వం ఆదేశం

విజయనగరం, సెప్టెంబర్ 4: గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజు స్థలం వివాదంపై విచారణకు కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. విజయనగరం మున్సిపల్ పరిధిలోని మహారాజుపేట సౌత్ వార్డులో టౌన్ సర్వే నెంబర్ 569 లో 4 ఎకరాల 74 సెంట్లలో.. ఎకరా స్థలంలో వైసీపీ కార్యాలయాన్ని నిర్మించింది. ఈ వ్యవహారాన్ని అశోక్ గజపతిరాజు వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తన స్థలంలో అక్రమంగా వైసీపీ కార్యాలయ నిర్మాణం చేపట్టారంటూ గత ఏడాది విజయనగరం కలెక్టర్‌కు ఆధారాలు సమర్పించారు. సదరు ఆధారాలను పరిశీలించిన కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. అప్పటి ఎమ్మార్వో ప్రభాకర్ రావుపై విచారణకు ఆదేశాలు జారీ చేసింది. వారం రోజులలోపు ఆ వివరాలు అన్నీ ఇవ్వాలని జిల్లా ఉన్నతాధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

## ఈ ఏడాది తొలి విజయం.. జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 మిషన్: ఇస్రో ఛైర్మన్ నారాయణన్



నెల్లూరు,సెప్టెంబర్ 04: ఈ ఆర్థిక సంవత్సరంలో జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 మిషన్ సక్సెస్ కావడం తొలి విజయమని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ తెలిపారు. మరో ఆరు ప్రయోగాలను నిర్వహిస్తామని చెప్పారు. శుక్రవారం శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష పరిశోధన కేంద్రం నుంచి శుక్రవారం జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 మిషన్ విజయవంతమైన నేపథ్యంలో ఆయన స్పందించారు. భారతదేశపు తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్'కు సంబంధించిన మొదటి ప్రయోగం త్వరలోనే నిర్వహిస్తామని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ వెల్లడించారు. శుక్రవారం ఉదయం ప్రయోగించిన జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 రాకెట్.. నిర్దేశించిన 19 నిమిషాల్లోనే శాటిలైట్‌ను కక్ష్యలోకి చేర్చింది. ?నిర్దేశిత సమయంలో 28,934 కిలోమీటర్లు ప్రయాణించి నిర్ణీత కక్ష్యలోకి రాకెట్ చేరింది. వాతావరణం, భూ పరిశీలనకి సంబంధించిన కీలక సమాచారాన్ని ఈ శాటిలైట్ ఇూా-05 అందించనుంది. ఈ రాకెట్ విజయవంతంగా ప్రయోగించడం ద్వారా భారత సాంకేతిక నైపుణ్యం, శాస్త్రవేత్తల కృషికి ప్రతీకగా మరో చారిత్రాత్మక విజయంగా నిలిచింది. ఈ రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంతో.. షార్ అంతరిక్ష కేంద్రంలోని ఉద్యోగుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. శుక్రవారం తెల్లవారుజామున 2.55 గంటలకు షార్‌లోని అంతరిక్ష కేంద్రం నుంచి ఈ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించారు.




# సంపాదకీయం

శనివారం 05-09-2026

## సుభాష్ చంద్ర కేసులో ఏం జరుగుతోంది

మీడియా దిగ్గజం, ఎస్సెల్ గ్రూప్ వ్యవస్థాపకులు సుభాష్ చంద్ర వ్యక్తిగత దివాలా పరిష్కార ప్రక్రియలో కీలక పరిణామం చోటు చేసుకుంది. రూ. 22006.57 కోట్ల క్లెయిమ్‌లకు గాను కేవలం రూ. 6.5 కోట్ల చెల్లింపు ప్రణాళికకు తాత్కాలిక బ్రేక్ పడింది. ఈ దివాలా ప్రణాళికకు డివిజన్ బెంచ్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడంతో ఎన్ సీ ఎల్ టీ ప్రెసిడెంట్ జస్టిస్ అనుపిందర్ సింగ్ గ్రేవాల్ నేతృత్వంలో 5 మంది సభ్యుల ప్రత్యేక రాజ్యాంగ బెంచ్ ఏర్పాటు చేశారు. ఎన్‌సీఎల్‌టీ చరిత్రలోనే ప్రత్యేక బెంచ్ ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి ఐదుగురు సభ్యుల ప్రత్యేక బెంచ్ సెప్టెంబర్ 1, 2026న ఈ కేసులో నోటీసులు జారీ చేసింది. అశోక్ కుమార్ భరద్వాజ్, రీనా సిన్హాలతో కూడిన రెండవ నంబర్ ఎన్‌సీఎల్‌టీ డివిజన్ బెంచ్ ఈ దివాలా ప్రణాళికపై ఏకాభిప్రాయానికి రాలేకపోయింది. మూడో సభ్యుడైన నిలేశ్ శర్మ ఇచ్చిన స్వతంత్ర ఉత్తర్వు సైతం డివిజన్ బెంచ్‌లోని ఇద్దరితో విభేదించడంతో మేజారిటీ తీర్పు లేనందున ఎటువంటి తుది ఉత్తర్వులు ఇవ్వలేమని ట్రిబ్యునల్ స్పష్టం చేసింది. మెజారిటీ అభిప్రాయం రాకపోవడంతో కేసును ఎన్ సీ ఎల్ టీ ప్రెసిడెంట్‌కు పంపారు. కంపెనీల చట్టం 2013లోని సెక్షన్ 419 (5) ప్రకారం చరిత్రలోనే మొదటిసారిగా 5 మంది సభ్యుల ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో జస్టిస్ అనుపిందర్ సింగ్ గ్రేవాల్, జ్యుడీషియల్ సభ్యులు బచు వెంకట్ బలరామ్ దాస్, మహేంద్ర ఖండేల్వాల్, టెక్నికల్ మెంబర్స్ అతుల్ చతుర్వేది, రవీంద్ర చతుర్వేదిలు ఉన్నారు. సుభాష్ చంద్ర వ్యక్తిగత హామీలపై రూ. 22,006.57 కోట్ల రుణాలకు సంబంధించి రుణ దాతల క్లెయిమ్‌లపై ఆయన దివాలా పరిష్కార ప్రణాళికకు వెళ్లారు. ఈ క్రమంలో కేవలం రూ. 6.5 కోట్లు చెల్లించేందుకు ఎన్‌సీఎల్‌టీ ఆమోదం తెలిపినట్లు వార్తలు వచ్చాయి. రూ. 22 వేల కోట్లకు పైగా అప్పును రూ. 6.5 కోట్లతో సెటిల్ చేసేందుకు 80.81 శాతం ఓటింగ్ ఉన్న రుణదాతలు ఆమోదం తెలిపారు. అయితే ఇది దాదాపు 99.97 శాతం రుణాల రద్దుకు దారితీస్తోంది. ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వంటి 19.19 శాతం ఓటింగ్ కలిగిన సంస్థలు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ క్రమంలో ఇన్సాల్వెన్సీ అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాయి. సుభాష్ చంద్ర, అతని గ్రూప్ చాలా ఏళ్లుగా ఆర్థిక సంక్షోభంతో ఇబ్బంది పడుతోంది. వారి రుణ భారం క్రమంగా పెరుగుతూ వస్తోంది. కంపెనీలు తమ రుణాలను తిరిగి చెల్లించలేకపోయినప్పుడు విషయం కోర్టుకు చేరింది. నివేదికల ప్రకారం, ఎస్సెల్ గ్రూప్‌కు సుమారు ?22,006 కోట్ల భారీ అప్పు ఉంది. దీన్ని పరిష్కరించడానికి, సుభాష్ చంద్ర కేవలం ?6.5 కోట్ల తిరిగి చెల్లింపు ప్లాన్ ఇచ్చారు. దీనిని ట్రైబ్యునల్ ఆమోదించింది. అంటే రుణాలు ఇచ్చిన బ్యాంకులు తమ రుణాలపై భారీగా నష్టపోవాల్సి ఉంటుంది. ఈ కీలక నిర్ణయం ఆమోదానికి దారితీసిన న్యాయ ప్రక్రియ కూడా చాలా ఆసక్తికరంగా ఉంది. సెప్టెంబర్ 2025లో, ఎన్ సీ ఎల్ టీ కి చెందిన ఇద్దరు సభ్యుల ధర్మాసనం మధ్య రెండు విభిన్న అభిప్రాయాలు వెలువడ్డాయి. తదనంతరం, ఫిబ్రవరి 2026లో, ఈ విషయాన్ని ట్రైబ్యునల్ మూడో న్యాయ సభ్యుడైన నిలేష్ శర్మకు నివేదించారు. ఆయన ఈ ప్రణాళికను ఆమోదిస్తూ తన నిర్ణయాత్మక తీర్పును వెలువరించారు. అంతకుముందు, నవంబర్ 2024లో, రుణదాతల కమిటీ 80.814 శాతం ఓట్లతో ఈ ప్రణాళికను ఆమోదించింది. దివాలా, బ్యాంక్రప్టసీ కోడ్ ప్రకారం, ఏ ప్రణాళిక ఆమోదానికైనా 75 శాతం మెజారిటీ అవసరం,ప్రజలు తరచుగా ఎన్‌సిఎల్‌టిని ఒక కంపెనీగా భావిస్తుంటారు. కానీ వాస్తవానికి ఇది ఒక ప్రత్యేకమైన పాక్షిక–న్యాయ సంస్థ. దీని పూర్తి పేరు నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్. దీనిని కేంద్ర ప్రభుత్వం, కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 408 కింద, 2016 జూన్ 1న అధికారికంగా ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలోని జస్టిస్ వి. బాలకృష్ణ ఏరాడి కమిటీ సిఫార్సుల ఆధారంగా ఈ సంస్థను ఏర్పాటు చేశారు. సాధారణ కోర్టుల ద్వారా కాకుండా, ఒక ప్రత్యేక వేదిక ద్వారా భారత్‌లో వ్యాపార, కార్పొరేట్ వివాదాల పరిష్కారాన్ని వేగవంతం చేయడమే దీని ప్రాథమిక ఉద్దేశ్యం. కార్పొరేట్ ప్రపంచానికి సంబంధించి ఎన్‌సిఎల్‌టి కి విస్తృత శ్రేణి అధికారాలు, బాధ్యతలు ఉన్నాయి. ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్ (ఎఃఅ, 2016) ప్రకారం, కంపెనీలను దివాలా తీసినట్లు ప్రకటించడం లేదా వాటి రుణాలను పరిష్కరించడం వంటి విషయాలను ఇది విచారిస్తుంది. అంతేకాకుండా, రెండు లేదా అంతకంటే ఎక్కువ కంపెనీల మధ్య విలీనాలు, ఒక కంపెనీని విభజించడం లేదా కార్పొరేట్ పునర్నిర్మాణానికి సంబంధించిన నిర్ణయాలను కూడా ఇది ఆమోదిస్తుంది. వాటాదారులు, కంపెనీ యాజమాన్యం మధ్య వివాదాలను, లేదా నష్టాల్లో ఉన్న కంపెనీ చట్టపరమైన లిక్విడేషన్‌ను కూడా ఎన్‌సిఎల్‌టి పర్యవేక్షిస్తుంది. క్లెయిమ్‌లోని ప్రతి ?100కి రికవరీ మొత్తం కేవలం మూడు పైసలు మాత్రమే. ఈ కేసు ఒక ముఖ్యమైన ప్రశ్నను లేవనెత్తుతోంది..దివాలాలను పరిష్కరించడానికి, రుణాలను వసూలు చేయడానికి ఒక ఆధునిక చట్రాన్ని సృష్టించేందుకు దివాలా, బ్యాంక్రప్టసీ కోడ్, 2016ను రూపొందించారు. ఈ చట్టం కంపెనీలకు, కార్పొరేట్ రుణగ్రహీతలకు పూర్తిగా వర్తిస్తుంది. అయితే, వ్యక్తులు, భాగస్వామ్య సంస్థల దివాలా, బ్యాంక్రప్టసీకి సంబంధించిన ఐబిసిలోని పార్ట్ 3, సాధారణ ప్రజల కోసం ఇంకా పూర్తిగా అమలు కాలేదు. ఒక ముఖ్యమైన మినహాయింపు ఉంది. ఐబిసి ??ప్రకారం, ఒక కంపెనీ లేదా భాగస్వామ్య సంస్థ తీసుకున్న కార్పొరేట్ రుణానికి ఒక వ్యక్తి వ్యక్తిగత హామీ ఇచ్చి, ఆ తర్వాత రుణగ్రహీత చెల్లింపులో విఫలమైతే, ఆ వ్యక్తి దివాలా ప్రక్రియను ఎదుర్కోవలసి వస్తుంది. అందుకే పెద్ద కార్పొరేట్ రుణాలకు సంబంధించిన కేసులలో వ్యక్తిగత దివాలా ప్రక్రియలను ప్రారంభించవచ్చు. అప్పుల్లో ఉన్న వ్యక్తి కేవలం ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లి దివాలా ప్రకటించుకోలేరు. వారు సాధారణంగా సంబంధిత న్యాయస్థానానికి వెళ్లి, అధికారిక న్యాయ ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుంది.

## ప్రియురాలి ఇంటిపై పెట్రోల్ బాంబ్.. తమిళనాడులో యువకుడి అరెస్ట్



తన ప్రియురాలు వారం రోజులుగా మాట్లాడడం లేదని ఓ ప్రేమోన్మాది ఆగ్రహించాడు. ప్రియురాలి ఇంటిపై ఏకంగా పెట్రోల్ బాంబ్‌తో దాడి చేశాడు. ఈ తతంగమంతా అక్కడి సీసీటీవీ కెమెరాల్లో రికార్డవడంతో పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు మధురైకి చెందిన నాగార్జున అనే 23 ఏళ్ల యువకుడు ఓ యువతితో ఆరేళ్లుగా ప్రేమలో ఉన్నాడు. అయితే వారి మధ్య స్వల్ప ఘర్షణ తలెత్తడంతో ఆ యువకుడితో ఆమె వారం రోజుల నుంచి మాట్లాడడం లేదని సమాచారం. ఈ విషయం తట్టుకోలేక మనస్తాపం చెందిన అతడు.. మద్యం సేవించి, ప్రియురాలి ఇంటిపై పెట్రోల్ బాంబ్ విసిరాడు. ఆ బాంబ్ పేలి ప్రమాదవశాత్తూ అగ్ని జ్వాలలు అతడిపైనే పడ్డాయి. దీంతో వెంటనే అతడు అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటన మొత్తం స్థానిక సీసీటీవీ కెమెరాలో రికార్డైంది. విషయం తెలుసుకున్న పోలీసులు సదరు యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం అతడిని జ్యుడీషియల్ కస్టడీలో ఉంచామని తెలిపారు. దర్యాప్తు ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. అయితే.. ఆ రాష్ట్ర అసెంబ్లీలో మహిళల భద్రతపై ప్రభుత్వానికి, ప్రతిపక్షానికి మధ్య వాడీవేడిగా చర్చ జరిగిన తరువాతి రోజే ఈ ఘటన జరగడం చర్చనీయాంశమైంది. ముఖ్యమంత్రి విజయ్ పాలనలో రాష్ట్రంలో క్రైమ్ రేట్ పెరిగిపోయిందని ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ ఆరోపించారు. టీవీకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 116 రోజుల్లోనే 200 మర్డర్లు జరిగాయన్నారు. అయితే వీటిపై విజయ్ స్పందిస్తూ.. ప్రతి ప్రశ్నకూ తాను వచ్చే సోమవారం సమాధానమిస్తానని అన్నారు.

## సైనిక విన్యాసాలు ప్రారంభించబోతున్న ఇండియన్ ఎయిర్‌ఫోర్స్.. ఆందోళనలో పాక్

ఇండియా సైనిక కార్యకలాపాలను ప్రారంభించిందంటే చాలు పాకిస్తాన్‌లో వణుకు ప్రారంభమవుతుంది. తాజా పరిణామాలే ఇందుకు ఉదాహరణ. భారత నావికాదళం త్వరలో సైనిక విన్యాసాలు నిర్వహించేందుకు నోటం జారీ చేసింది. నావికాదళానికి సంబంధించిన సైనిక విన్యాసాలకు సంబంధించిన ఏర్పాట్ల కోసం ఈ నోటిఫికేషన్ జారీ చేస్తారు. ఇండియా–పాకిస్తాన్ సరిహద్దులో, రాజస్థాన్‌లో 17 రోజులపాటు నోటం జరగనుంది. సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 7 వరకు ఈ సైనిక విన్యాసాలు కొనసాగుతాయి. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను వాయుసేన విడుదల చేసింది.



అయితే, మన ఎయిర్‌ఫోర్స్ సైనిక విన్యాసాలు చేసేందుకు సిద్ధమవుతుంటే పాకిస్తాన్ వణికిపోతోంది. పాకిస్తాన్ రక్షణ శాఖ అధికారులు ఆకస్మికంగా ఒక ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఇండియా చేపట్టనున్న సైనిక విన్యాసాలపై సమీక్ష నిర్వహించారు. ఇస్లామాబాద్‌లో ఉన్న భద్రతా దళాలా చీఫ్ ఆధ్వర్యంలో ఈ సమిక్ష జరిగింది. ఇండియా–పాక్ సరిహద్దులో ఈ సైనిక విన్యాసాల వల్ల కలిగే పరిణామాలపై చర్చించారు. ఇదే సమయంలో భారత సరిహద్దులో నిఘా పెంచాలని అక్కడి సైనిక అధికారులు ఆదేశించారు. మన సైనిక విన్యాసాల్ని పాక్ సైన్యం నిరంతరం పర్యవేక్షించనుంది. భారత వైమానిక దళానికి సంబంధించి చేపట్టే మార్పులు, సంసిద్ధత, నిషేధాలు వంటి అంశాలపై విమాన ఆపరేటర్లు, సంబంధికులకు అందే రక్షణ నోటిఫికేషన్ నోటం. సైనిక డ్రిల్స్ నిర్వహిస్తున్నప్పుడు మామూలుగానే నోటం జారీ చేస్తుంటారు. ఎయిర్‌స్పేస్‌లో నిషేధాజ్ఞలు, భద్రత వంటివి దీని పరిధిలోకి వస్తాయి. 17 రోజులపాటు భారీ సైనిక విన్యాసాలు జరగనున్నాయి.

## మూడేళ్ల చిన్నారిపై స్కూల్ వ్యాన్ డ్రైవర్ అత్యాచారం.. లాస్ట్ స్టాప్ కావడమే శాపం

మహారాష్ట్ర, నవీ ముంబైలో దారుణం జరిగింది. మూడేళ్ల చిన్నారిపై స్కూల్ వ్యాన్ డ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. అది కూడా స్కూల్ వ్యాన్‌లోనే లైంగిక దాడికి దిగాడు. ఈ ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలివి. నవీ ముంబైలో ఒక మూడేళ్ల చిన్నారి రోజూ స్కూల్ వ్యాన్‌లో పాఠశాలకు వెళ్లి వస్తుండేది. ఆ వ్యాన్‌లో స్కూల్ నుంచి ఇంటికి తిరిగి వచ్చే చివరి చిన్నారి ఆ పాపే. వ్యాన్‌లోని మిగతా వాళ్లు ముందే దిగిపోయేవారు. ఆ మూడేళ్ల పాప అందరికంటే చివరి స్టాప్‌లో దిగాలి. దీంతో మిగతావాళ్లు దిగిన తర్వాత వ్యాన్‌లో ఒంటరిగానే ఉండేది. ఈ క్రమంలో వ్యాన్ డ్రైవర్ పాపపై అత్యాచారానికి పాల్పడ్డాడు. చిన్నారి ఇంటికి వచ్చిన తర్వాత తీవ్ర కడుపు నొప్పితో బాధపడింది. ఈ కడుపు నొప్పి గురించి పాపను తల్లిదండ్రులు ఆరా తీయగా.. స్కూల్ వ్యాన్ డ్రైవర్ తనతో ఎలా ప్రవర్తించింది చెప్పింది. పాప అత్యాచారానికి గురైనట్లు గుర్తించారు. ఈ విషయం తెలిసి షాక్ తిన్న తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. లాస్ట్ స్టాప్ వరకు వ్యాన్‌లో ఎవరూ లేకపోవడం, పాప ఒక్కర్తే ఉండటం వల్ల ఈ అత్యాచార ఘటన జరిగింది. డ్రైవర్ ఈ దారుణానికి ఒడిగట్టాడు. అయితే, ఇలాంటి ఘటనలు తలెత్తకూడదనే ఉద్దేశంతోనే పిల్లలు ప్రయాణించే స్కూల్ బస్సుల విషయంలో ప్రభుత్వం కొన్ని రూల్స్ రూపొందించింది. దీని ప్రకారం.. స్కూల్ బస్సులో తప్పనిసరిగా ఒక మహిళా సిబ్బంది ఉండాలి. చివరి విద్యార్థి దిగేవరకు ఆ వ్యక్తి బస్సులోనే ఉంటూ, వారి రక్షణ బాధ్యతలు చూసుకోవాలి. అలాగే, స్కూల్ బస్సుల్లో సీసీటీవీ కెమెరాలు, ట్రాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలి. దీని ద్వారా తల్లిదండ్రులు తమ పిల్లలు ప్రయాణించే బస్సులను నిరంతరం మానిటరింగ్ చేయగలుగుతారు. అయితే, ఈ ప్రమాణాల్ని పాటించకపోవడం వల్ల విద్యార్థుల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది.



## 23 మంది భారతీయులున్న కార్గో షిప్పుపై డ్రోన్ దాడి.. రష్యా నుంచి కరాచీ వెళ్తుండగా ఘటన



23 మంది భారతీయ సిబ్బంది ఉన్న కార్గో షిప్పుపై డ్రోన్ దాడి జరిగింది. సెప్టెంబర్ 2, బుధవారం జరిగిన ఈ ఘటనలో ఎవరికీ, ఎలాంటి హానీ కలగలేదని సమాచారం. షిప్పు రష్యా నుంచి పాకిస్తాన్‌లోని కరాచీ వెళు తుండగా దాడి జరిగింది. ఎంవీ బేర్యోన్ (ఐఎంఓ 9151412) అనే కార్గో షిప్పు రష్యాలోని నోవోరోస్సిస్క్ నుంచి పాక్‌లోని కరాచీ వెళ్తోంది. ఈ సమయంలో నౌకలో 23 మంది భారతీయ సిబ్బంది ఉన్నారు. సెప్టెంబర్ 2న ఈ నౌకపై డ్రోన్ దాడి జరిగింది. ఈ ఘటనతో నౌకలో మంటలు చెలరేగాయి. అయితే, సిబ్బంది వెంటనే అప్రమత్తమై ఆ మంటల్ని ఆర్పేశారు. ఆ తర్వాత మరో డ్రోన్ దాడి జరిగింది. అది నౌకకు సమీపంలో పడింది. అయితే, ఈ ఘటనల్లో నౌకలోని సిబ్బందికి ఎలాంటి గాయాలు కాలేదని, అంతా సురక్షితంగా ఉన్నారని ఫార్వర్డ్ సీమెన్స్ యూనియన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రెటరీ మనోజ్ యాదవ్ వెల్లడించారు. దాడి తర్వాత నౌక ఎప్పట్లాగే తన ప్రయాణాన్ని కొనసాగించిందని ఆయన వెల్లడించారు. యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లో.. వాణిజ్య నౌకలకు, నౌకలోని సిబ్బందికి భద్రత లేకుండా పోతుందని చెప్పేందుకు ఈ ఘటన మరో ఉదాహరణ అని మనోజ్ అన్నారు. అంతర్జాతీయంగా నౌకా రవాణాలో భారతీయ నావికా సిబ్బంది కీలకంగా పని చేస్తున్నారని, అయితే, ఇటీవలి పరిణామాల వల్ల వారు తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్నారని మనోజ్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఘర్షణలకు ఏమాత్రం సంబంధం లేకుండా భారతీయ సిబ్బంది దాడులకు గురవుతున్నారని చెప్పారు. ఇరాన్–అమెరికా యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు వాణిజ్య నౌకలపై జరిగిన అనేక దాడుల్లో భారతీయులున్నారు. పలువురు ప్రాణాలు కూడా కోల్పోయారు.

## విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడించిన బీఆర్ఎస్ శ్రేణులు.. వంటవార్పుతో నిరసన



ఆదిలాబాద్ : కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనపై బీఆర్ఎస్ పోరుబాట నిర్వహించింది. ఇచ్చోడ విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడించి వంటా వార్పుతో నిరసన తెలిపారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ రైతులతో కలిసి ఉరి తాడుతో వినూత్న నిరసన తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరాలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం , ఇప్పుడు రైతులను కరెంట్ కోతలతో ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. విద్యుత్ సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోకుండా వ్యవహరిస్తోందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా, రైతుబంధు, రైతుబీమా వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు.

## ఎయిర్‌పోర్ట్‌లో పార్కింగ్ సమయంలో.. స్తంభాన్ని ఢీకొట్టిన ఇండిగో విమానం

శ్రీనగర్: ఎయిర్‌పోర్ట్‌లో పార్కింగ్ సమయంలో ఇండిగో విమానం ఒక స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆ పోల్ పక్కకు ఒరిగిపోయింది. ఈ ప్రమాదంలో విమానం ముందు భాగం స్వల్పంగా దెబ్బతిన్నది. అయితే అందులోని ప్రయాణికులు, సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారు. శుక్రవారం ఇండిగోకు చెందిన 6ఈ 225 ఫ్లైట్ నవీ ముంబై నుంచి శ్రీనగర్ చేరుకున్నది. ఉదయం 9 గంటలకు శ్రీనగర్ విమానాశ్రయంలో అది ల్యాండ్ అయ్యింది. అయితే ఎయిర్‌పోర్ట్‌లోని 6వ నంబర్ బే వద్ద పార్కింగ్ సమయంలో ఆ విమానం ప్రమాదానికి గురైంది. అక్కడ ఉన్న ఒక స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో ఆ పోల్ ఒక పక్కకు ఒంగిపోయింది. ఈ సంఘటనలో ఇండిగో ఫ్లైట్ ముందు భాగం స్వల్పంగా దెబ్బతిన్నది. కాగా, ఈ ప్రమాదాన్ని ఇండిగో సంస్థ ధృవీకరించింది. ప్రయాణికులు, సిబ్బంది సురక్షితంగా ఉన్నట్లు తెలిపింది. విమానంలోని మాన్యువల్ మెట్ల ద్వారా ప్రయాణికులను, సిబ్బందిని సురక్షితంగా కిందకు దించినట్లు వివరించింది. మరోవైపు నిర్దేశిత నిబంధనలప్రకారంసంఘటన గురించి సంబంధిత అధికారులకు వెంటనేస మాచారం అందించి నట్లు ఇండిగో సంస్థ తెలిపింది. ఆ అధికారులతో కలిసి దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొంది. 'అవసరమైన నిర్వహణ పనుల కోసం ఆ విమానాన్ని నిలిపివేశాం. అవసరమైన అనుమతులు పొందిన తర్వాత కార్యకలాపాలను తిరిగి ప్రారంభిస్తాం. వినియోగదారులు, సిబ్బంది భద్రతే మాకు అత్యంత ప్రాధాన్యత' అని వెల్లడించింది. అయితే ఈ సంఘటన తర్వాత శ్రీనగర్ విమానాశ్రయంలో కార్యకలాపాలు సాధారణంగానే కొనసాగాయి. విమానాల రాకపోకలు షెడ్యూల్ ప్రకారం జరుగుతున్నట్లు ఎయిర్‌పోర్ట్ అధికారులు తెలిపారు.



# ఫలితాలను ఇస్తున్న అక్షర ఆంధ్ర

విజయవాడ, సెప్టెంబర్ 4, దేశంలోనే అత్యంత తక్కువ అక్షరాస్యత కలిగిన రాష్ట్రాల్లో ఒకటిగా విమర్శలు ఎదుర్కొన్న ఆంధ్రప్రదేశ్, గత రెండేళ్లలో సాధించిన ప్రగతి విద్యా రంగంలో ఒక మైలురాయిగా నిలుస్తోంది. 2024 నాటికి కేవలం 72.6 శాతంగా ఉన్న అక్షరాస్యత, 2026 నాటికి ఏకంగా 82.1 శాతానికి చేరుకుంది. జాతీయ సగటు కంటే వెనుకబడిన స్థితి నుంచి కేవలం రెండేళ్ల వ్యవధిలోనే దాదాపు 10 శాతం మేర అక్షరాస్యత పెరగడం వెనుక విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ చేపట్టిన పక్కా ప్రణాళికలు, క్షేత్రస్థాయి పరిశీలన, రిజల్ట్–ఓరియంటెడ్ విధానాలే ప్రధాన కారణం.ఈ భారీ మార్పుకు అక్షర ఆంధ్ర కార్యక్రమం వెన్నెముకగా నిలిచింది. విద్యా శాఖను చేపట్టిన వెంటనే నారా లోకేష్, కేవలం పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతోనే సరిపెట్టకుండా ఫలితాలు ఆధారంగా పనిచేసే ప్రత్యేక కార్యాచరణను అమలు చేశారు. సుమారు 11 ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాలలో నిర్వహించిన అక్షరాస్యతా విభాగాలు, ఫీల్డ్ ప్రోగ్రామ్‌ల ద్వారా గత ఏడాది కాలంలోనే దాదాపు 25 లక్షల మందిని అక్షరాస్యులుగా మార్చడం లోకేష్ పరిపాలనా దక్షతకు అద్దం పడుతోంది.అంతేకాకుండా, పాఠశాల విద్యలో డ్రాపౌట్లను తగ్గించి హాజరు శాతాన్ని పెంచడంపై మంత్రి లోకేష్ ప్రత్యేక దృష్టి సారించారు. ఒఇంఖ యాప్ ద్వారా బడికి దూరమైన 1.64 లక్షలకు పైగా పిల్లల డేటాను సేకరించి, వారిలో సుమారు 33 వేల మందిని తిరిగి పాఠశాలల్లో చేర్పించడం, టీచర్ల హాజరును 98.97 శాతానికి తీసుకెళ్లడం విద్యావ్యవస్థలో వచ్చిన సమూల మార్పుకు ఉదాహరణ. ఉపాధ్యాయుల కొరత తీర్చే దిశగా నిర్ణయాలు తీసుకోవడమే కాకుండా, తల్లికి వందనం, సాంకేతికత ఆధారిత పర్యవేక్షణ ద్వారా విద్యార్థుల్లో జవాబుదారీతనాన్ని లోకేష్ పెంచగలిగారు.ఇప్పుడు ప్రభుత్వం విధించుకున్న ప్రతిష్టాత్మక లక్ష్యం సెప్టెంబర్ 2027 నాటికి 100% సంపూర్ణ అక్షరాస్యత సాధించడం. దీనికోసం 2027 మార్చి నాటికి మరో 25 లక్షల మందిని, సెప్టెంబర్ 2027 నాటికి మిగిలిన 27 లక్షల మందిని అక్షరాస్యులుగా మార్చడానికి ప్రజాప్రతినిధులను, స్థానిక సంస్థలను భాగస్వాములను చేస్తూ టైమ్–బౌండ్ టార్గెట్లను నిర్దేశించారు. ఇది కేవలం కాగితాలకే పరిమితం కాకుండా ప్రతీ నియోజకవర్గంలో కార్యాచరణ వేగవంతం అయ్యేలా ఐఏఎస్ అధికారులతో క్రమం తప్పకుండా చేస్తున్న సమీక్షలే ఈ వృద్ధికి బలం చేకూరుస్తున్నాయి.గడిచిన రెండేళ్లలో ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖలో నమోదైన ఈ గణనీయమైన మార్పు నారా లోకేష్ రాజకీయ, పరిపాలనా సామర్థ్యానికి ఒక బలమైన రుజువుగా నిలుస్తోంది. ఒకప్పుడు జాతీయ స్థాయిలో అక్షరాస్యతలో ఆఖరి వరుసల్లో నిలిచిన ఏపీని, 2027 నాటికి దేశంలోనే మొదటి సంపూర్ణ అక్షరాస్యత సాధించిన రాష్ట్రాలలో ఒకటిగా నిలిపేందుకు లోకేష్ వేస్తున్న అడుగులు ఆయన విజనరీ లీడర్‌షిప్‌ను స్పష్టం చేస్తున్నాయి.

# లోకల్ బాడీ ఎన్నికలకు కసరత్తు షురూ

విజయవాడ, సెప్టెంబర్ 4,ఏపీలో కూటమి పార్టీలు స్థానిక ఎన్నికలు రెడీ అవుతున్నాయి. ఇప్పటికే జనసేన అధిష్ఠానం.. ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్యకర్తలతో వరుసగా భేటీ అవుతుంది. టీడీపీ కూడా ఎన్నికల కసరత్తును స్పీడప్ చేసింది. ఈ నెల 6, 7 తేదీల్లో టీడీపీ ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఏడు అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. టీడీపీ ఎమ్మెల్యేలు అందరూ శిక్షణ తరగతులకు హాజరు కావాలని టీడీపీ కేంద్ర కార్యాలయం ఆదేశించింది. ఎన్నికల నిర్వహణ కసరత్తులో భాగంగా ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఇవాళ సాయంత్రం మంత్రులు, కీలక నేతలతో సీఎం టింగ్ నిర్వహించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు, మున్సిపాలిటీల్లో జరుగుతున్న పనులు, కూటమి పార్టీల సమన్వయంపై చర్చించే అవకాశం ఉంది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు అనుకున్న సమయానికే జరుగుతాయని, వాయిదా వేసే ప్రసక్తే లేదని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. అమరావతిలో టీడీపీ మంత్రులతో ఆయన బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి లోకేష్ పార్టీ నాయకులకు, ఎమ్మెల్యేలకు ఎన్నికల గురించి దిశానిర్దేశం చేశారు. ఎన్నికల ప్రక్రియ అక్టోబర్ నాటికి పూర్తవుతుందన్నారు. ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేసి, అన్ని స్థానాల్లోనూ కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని మంత్రి లోకేష్ నేతలకు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలు దశలవారీగా జరుగుతాయని మంత్రి లోకేష్ తెలిపారు. మొదటిగా మున్సిపల్ ఎన్నికలు, ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఆపై పంచాయతీ ఎన్నికలు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. పెండింగ్ కేసులను పరిష్కరించుకుని, అన్ని స్థానాల్లోనూ ఎన్నికలు నిర్వహించేలా ప్రయత్నిస్తున్నామన్నారు. వైసీపీ హయాంలో నిలిచిపోయిన అర్హులందరికీ అక్టోబర్ నెల నుంచి దశలవారీగా కొత్త పింఛన్లను మంజూరు చేస్తామని చెప్పారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి లబ్ధిదారులకు న్యాయం చేస్తామన్నారు. ఎస్ఐఆర్ ఓటర్ల జాబితానే స్థానిక సంస్థల ఎన్నికలకు తుది జాబితాగా తీసుకోవాలని వైసీపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే సమయానికి ఫోర్సులో ఉన్న, చెల్లుబాటయ్యే ఓటర్ల జాబితానే ఎన్నికలకు ప్రాతిపదికగా తీసుకోవచ్చని ప్రభుత్వం చెబుతోంది. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయి తుది ఓటర్ల జాబితా వచ్చే వరకు ఎన్నికలను ఆపాల్సిన అవసరం లేదని ప్రభుత్వ వైఖరిగా ఉంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే నాటికి అమల్లో ఉన్న ఓటర్ల జాబితాతోనే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు బీసీ రిజర్వేషన్లపై కోర్టు నుంచి అభ్యంతరాలు వచ్చినా.. వాటిని అధిగమించే మార్గాలపై ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. అవసరమైతే పార్టీ పరంగా కూడా బీసీలకు ఓసీ జనరల్ కేటగిరీలో సీట్లు కేటాయించేలా నిర్ణయం తీసుకోవాలని టీడీపీ భావిస్తోంది.

# దుర్గమ్మ దర్శనానికి వచ్చిన భక్తురాలు మృతి

విజయవాడ,ఇంద్రకీలాద్రి లో దుర్గమ్మ దర్శనానికి వచ్చిన భక్తురాలు మృతి చెందింది. ఇంద్రకీలాద్రి మహా మండపం రెండో అంతస్తులో అస్వస్థతకు గురైయింది. భక్తురాలిని దేవస్థాన అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతురాలు పెనమలూరు మండలం తాడిగడపకు చెందిన కె. పద్మ(61. తన భర్త నాంచారయ్యతో కలిసి గురువారం అమ్మవారి దర్శనానికి వచ్చింది. అమ్మవారి దర్శనం అనంతరం అన్నప్రసాదం స్వీకరించేందుకు రెండో అంతస్తులో దింపాలని లిఫ్టు సిబ్బందిని భక్తురాలు కోరారు. రెండో ఫ్లోర్లో కాకుండా గ్రౌండ్ ఫ్లోర్లో దింపిన సిబ్బంది.. మెట్లపై రెండో అంతస్తుకు వెళ్లాలని ఆదేశించారు. మెట్లు ఎక్కే క్రమంలో తీవ్ర అస్వస్థతకు భక్తురాలు పద్మ గురయింది. వెంటనే పద్మను దేవస్థాన అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేసారు. అయితే మార్గమధ్యలో పద్మ మృతి చెందింది.

# కూటమిలో మైక్రో మేనేజ్‌మెంట్

ఏలూరు, సెప్టెంబర్ 4, నరసాపురం నియోజకవర్గంలో నిర్వహించిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్థానిక జనసేన ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పనితీరుపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేయడం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీసింది. నియోజకవర్గానికి చెందిన 25 కేపీఐ సూచీల్లో 23 మైనస్ ఉన్నాయని సభాముఖంగా స్పష్టం చేస్తూ, నోడల్ అధికారిని మార్చాలని కలెక్టర్‌ను ఆదేశించడం, అధికారులకు గట్టిగా క్లాస్ తీసుకోవడం కలకలం రేపింది. పాలనా సంస్కరణలు, పనితీరు ఆధారిత నాయకత్వంపై చంద్రబాబుకు ఉన్న పట్టుకు ఇది నిదర్శనమే అయినా, మిత్రపక్ష ఎమ్మెల్యేను ప్రజల ముందే అలా నిలదీయడం కూటమి ధర్మానికి విఘాతం కలిగిస్తుందా అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.తెలుగుదేశం పార్టీ అధినేతగా సొంత పార్టీ ఎమ్మెల్యేలను, మంత్రులను చంద్రబాబు వేదికలపై లేదా సమీక్షా సమావేశాల్లో హెచ్చరించడం దశాబ్దాలుగా వస్తున్న శైలి. టీడీపీ ప్రజాప్రతినిధులు ఆ వ్యాఖ్యలను పార్టీ పెద్ద ఇచ్చే హెచ్చరికగా పరిగణిస్తారు. కానీ, కూటమి భాగస్వామి అయిన జనసేన పార్టీ ప్రజాప్రతినిధి విషయంలో అదే వ్యూహాన్ని వర్తింపజేయడం పొలిటికల్ ప్రోటోకాల్‌ను ఉల్లంఘించడమేనని భావిస్తున్నారు. జనసేన ఎమ్మెల్యేలు నేరుగా పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పనిచేస్తుండటంతో, వారి పనితీరుపై చర్యలు లేదా హెచ్చరికలు ఉంటే అంతర్గత సమన్వయ కమిటీల ద్వారా లేదా పవన్ కళ్యాణ్ ద్వారా ఇప్పించడమే సరైన పద్ధతిగా చెబుతున్నారు. ఈ బహిరంగ వ్యాఖ్యల పట్ల జనసేన కేడర్, జనసైనికులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. తమ ఎమ్మెల్యేకు పనితీరు సరిగా లేకపోతే సరిదిద్దే బాధ్యత తమ అధినేత పవన్ కళ్యాణ్‌ది అని, మైకుల ముందుకు వచ్చి ఒక నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఇమేజ్‌ను ప్రజల ముందు తగ్గించడం వల్ల రాబోయే రోజుల్లో గ్రౌండ్ లెవెల్‌లో కేడర్ మధ్య వైషమ్యాలు పెరుగుతాయని వారు ఆందోళన చెందుతున్నారు. మిత్రపక్ష నాయకుడి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా పబ్లిక్ వేదికలపై మాట్లాడటం వల్ల క్షేత్రస్థాయిలో టీడీపీ, జనసేన శ్రేణుల మధ్య ఉండాల్సిన ఐక్యత దెబ్బతినే ప్రమాదం ఉంది. ఇది రాబోయే రోజుల్లో మరింత పెద్ద రాజకీయ వివాదానికి ఆజ్యం పోసే అవకాశముంది. రేపు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఏదైనా ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు, పాలనాపరమైన లోపాలున్న ఏదేని టీడీపీ ఎమ్మెల్యేను లేదా టీడీపీ మంత్రుల నియోజకవర్గాలను ఉద్దేశించి ఇదే తరహాలో వ్యాఖ్యలు చేస్తే పరిణామాలు ఎలా ఉంటాయనే ప్రశ్న వస్తోంది. పవన్ కళ్యాణ్ కూడా టీడీపీ ప్రజాప్రతినిధులపై బహిరంగంగా విమర్శలు గుప్పిస్తే, అది పొత్తు ధర్మానికి ముగింపు పలికి రెండు పార్టీల మధ్య పరస్పర దాడులకు దారితీస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డేటా-డ్రివెన్ గవర్నెన్స్‌కు, రిపోర్ట్ కార్డులకు అత్యంత ప్రాధాన్యమిస్తారు. పాలనలో సీనియారిటీ, పొత్తులు చూడకుండా పనితీరునే ప్రామాణికంగా తీసుకుంటారనే సందేశాన్ని ప్రజల్లోకి పంపాలనేది ఆయన ఆలోచన కావచ్చు. రాష్ట్రాభివృద్ధికి కూటమి స్థిరత్వం ఎంత ముఖ్యమో గ్రహించిన క్రమంలో, వ్యూహాత్మకంగా మైక్రో మేనేజ్‌మెంట్ వ్యాఖ్యలను అంతర్గత సమావేశాలకే పరిమితం చేయకపోవడం చంద్రబాబు చేసిన ఒక చిన్న రాజకీయ అంచనా పొరపాటేనని నిపుణులు భావిస్తున్నారు. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందించాలంటే రిపోర్ట్ కార్డులను అమలు చేయడం ఎంత ముఖ్యమో, మిత్రపక్షాల ఆత్మగౌరవాన్ని కాపాడటం కూడా అంతే ముఖ్యమన్న భావన వ్యక్తమవుతోంది.

# నాదెండ్ల మనోహర్ పై అసహనం


గుంటూరు, సెప్టెంబర్ 4, జనసేన పార్టీలో కీలక నేత నాదెండ్ల మనోహర్ పై ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఆగ్రహంతో ఉన్నారు. నాదెండ్ల తమ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కు రాజకీయంగా తప్పుదోవ పట్టిస్తున్నారన్న భావన క్యాడర్ లో నెలకొంది. అంతా తానే అయి.. అధినేతను ఎవరినీ కలవనివ్వకుండా, వాస్తవ విషయాలను చెప్పనివ్వకుండా దాచి ఉంచుతున్నారని సోషల్ మీడియా వేదికగా ఆరోపిస్తున్నారు. నాదెండ్ల మనోహర్ పై ఇటువంటి ఆరోపణలు కొత్తేమీ కాదు. జనసేన పార్టీ పెట్టిన నాటి నుంచి పవన్ కళ్యాణ్ వెన్నంటే ఉన్న నాదెండ్లను పార్టీ నేతలు, కార్యకర్తలు వ్యతిరేకిస్తూనే వస్తున్నారు. తమ వ్యతిరేకతను సోషల్ మీడియాలో వ్యక్త పరుస్తున్నారు.



అంతే తప్పించి సభల్లోనూ, సమావేశాల్లోనూ పవన్ కళ్యాణ్ కు చెప్పేందుకు మాత్రం ప్రయత్నం చేయడం లేదు. అయితే నాదెండ్ల కేవలం పవన్ చేసిన సూచనల మేరకే అమలు చేస్తున్నారని, ఇందులో ఆయన తప్పేముందని కూడా కొందరు నాదెండ్ల మనోహర్ ను సమర్థిస్తున్నారు.ప్రపంచ పటాలు పరిశీలించండి.పార్టీలో కీలకంగా మారడంతో... ఇక ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పవన్ కళ్యాణ్ అస్వస్థతకు గురి కావడం, చంద్రబాబుతో భేటీలోనూ, పార్టీ నేతల సమావేశంలోనూ నాదెండ్ల మనోహర్ కీలకం గా వ్యవహరిస్తున్నారు. పవన్ కళ్యాణ్ ఆయనను నమ్మి కీలక పాత్రను అప్పగించారని చెబుతున్నారు. జనసేన పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ చైర్మన్, ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పై పార్టీ క్యాడర్ మరియు నేతల్లో కొంత అసంతృప్తి ఉందనే ప్రచారం సోషల్ మీడియా మరియు కొన్ని రాజకీయ వర్గాల్లో సాగుతుంది. .ప్రస్తుతం జనసేన పార్టీ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తమవుతున్న తరుణంలో, నాయకత్వం మరియు క్యాడర్ మధ్య సమన్వయం కోసం ఆయన విస్తృతంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. గెలిచే స్థానాల్లోనే పోటీ చేయాలని, బలం లేని చోట పోటీకి దిగవద్దని నాదెండ్ల మనోహర్ మనోహర్ వ్యాఖ్యానించడం దిగువ శ్రేణి నేతల్లో ఆగ్రహానికి కారణమయింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో టిక్కెట్ల కేటాయింపు తో పాటు పొత్తుల విషయంలో నాదెండ్ల మనోహర్ పవన్ ను తప్పుదోవ పట్టించి తిరిగి తమకు అన్యాయం చేయడానికి సిద్ధమయ్యారని కొందరు నేరుగానే ఆరోపిస్తున్నారు. గత శాసనసభ ఎన్నికల్లో కూటమి పొత్తుల వల్ల కొందరు స్థానిక జనసేన నేతలకు పోటీ చేసే అవకాశం దక్కకపోవడంతో అంతర్గతంగా కొంత అసంతృప్తి వ్యక్తమైంది. కొన్ని నియోజకవర్గాల్లో స్థానిక నేతల మధ్య ఉన్న విభేదాలు, నాదెండ్ల మనోహర్ వైఖరిపై విమర్శలుగా మారాయి. కూటమి ప్రభుత్వం మరియు జనసేన పార్టీలో చీలికలు తేవడానికి వైసీపీ వంటి ప్రతిపక్షాలు సోషల్ మీడియా వేదికగా ఇటువంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని జనసేన వర్గాలు మండిపడుతున్నాయి.పార్టీలో ఎటువంటి అంతర్గత విభేదాలు లేవని, జనసేనలో కేవలం "పవన్ కళ్యాణ్ గ్రూప్" మాత్రమే ఉందని నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్క కార్యకర్తకు, వీరమహిళకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుర్తింపు, అవకాశాలు లభిస్తాయని హామీ ఇచ్చారు.తాను ఎక్కడికి వెళ్లినా జనసైనికులు ఆత్మీయంగా పలకరిస్తున్నారని, పార్టీ శ్రేణులు అంతా ఐక్యంగా ఉన్నారని నాదెండ్ల మనోహర్ ఇటీవలే పేర్కొన్నారు.

# సిగరెట్లు అమ్ముకున్న భాకరాపేట ఫారెస్ట్ రేంజర్ సస్పెండ్

తిరుపతి: తిరుపతి జిల్లా భాకరాపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గా ఎన్ వెంకటరమణ పనిచేసేవారు. ఆయన ఏడాది క్రితం భాకరాపేట చెక్‌పోస్టు వద్ద రూ. 50 లక్షల సిగరెట్లను సీజ్ చేశారు. వాటిని ప్రభుత్వానికి అప్పగించకుండా గుట్టుచప్పుడు కాకుండా వేరేవారికి విక్రయించాడు. విచారణలో అది రుజువు కావడంతో వెంకటరమణను శుక్రవారం సస్పెండ్ చేశారు.చెన్నై నుంచి అక్రమంగా తరలిస్తున్న సిగరెట్ లోడును గతేడాది భాకరాపేట ఫారెస్ట్



చెక్‌పోస్ట్ వద్ద ఫారెస్ట్ ఆఫీసర్ వెంకటరమణ పట్టుకున్నాడు. సీజ్ చేసిన ఆ సిరెట్లను విక్రయించి సొమ్ముచేసుకున్నాడని అతడిపై ఆరోపణలు వచ్చాయి. కానీ జిల్లా స్థాయి అధికారులు పట్టించుకోకపోవడంతో తిరుపతి జీవకోనకు చెందిన జి మునిగోపాల్ ఈ విషయంపై అటవీ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన డిప్యూటీ సీఎం దీనిపై విచారణకు ఆదేశించారు.అటవీ శాఖ ఉన్నతాధికారులు విచారణ చేపట్టగా ఎఫ్ఆర్వో వెంకటరమణ వ్యవహారం బయటపడింది. దీంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ వెంకటాచలపతి అతడిని సస్పెండ్ చేశారు. సస్పెన్షన్ కాలంలో ఆయన హెడ్‌క్వార్టర్స్ భాకరాపేటలోనే ఉండాలని, అనుమతి లేకుండా ఎక్కడికి వెళ్లరాదని ఉత్తర్వులు జారీ చేశారు.

# స్టీల్ ప్లాంట్ ఆస్తులు వేలం

విశాఖపట్టణం, సెప్టెంబర్ 4, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ మిగులు భూముల్ని మరోసారి వేలం నిర్వహించబోతున్నారు. విశాఖపట్నంలోని హెచ్‌బీ కాలనీ, గాజువాక ఆటోనగర్ ప్రాంతం ఉన్న 459 ప్లాట్ల విక్రయానికి ఎన్‌ఎల్‌ఎంసీ (నేషనల్ ల్యాండ్ మానిటైజేషన్ కార్పొరేషన్) రూ.858.68 కోట్ల రిజర్వ్ ధరతో ఈ?ఆక్షన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. నిధుల సమీకరణ, అసెట్ మానిటైజేషన్‌లో భాగంగా వేలంపాటకు సిద్ధమైనట్లు పేర్కొన్నారు. విశాఖపట్నంలోని సీతమ్మధార పరిధిలో ఉన్న హెచ్‌బీ కాలనీలో 456 ప్లాట్లు 87,949.77 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్నాయి.. వాటిని రూ.838.93 కోట్ల రిజర్వ్ ధరతో వేలానికి సిద్ధమయ్యారు. అలాగే గాజువాక ఆటోనగర్‌లోని బ్లాక్? 2లో 2,728 చదరపు గజాలలో, మూడు బ్లాక్?3లోని 2894.44 చదరపు గజాల్లో ఉన్న రూ.19.75 కోట్లు విలువైన ప్లాట్లను వేలం వేయనున్నారు.ఈ ఏడాది అక్టోబర్ 12వతేదీన ఉదయం 11 గంటల నుంచి 243 ప్లాట్లకు.. 16వతేదీన ఉదయం 11 గంటల నుంచి 216 ప్లాట్లకు వేలం నిర్వహించనున్నారు. అక్టోబర్ 12న 243 ప్లాట్లకు సంబంధించి వేలంలో పాల్గొనేవారు అక్టోబర్ 8 సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అధికారులు సూచించారు. అక్టోబర్ 16న 216 ప్లాట్లకు సంబంధించి వేలంలో పాల్గొనేవారు అక్టోబర్ 14 సాయంత్రం 5 గంటలలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఒకవేళ ఎవరైనా ఈ ప్లాట్లను చూడాలనుకుంటే కేవీ సుబ్బరాజు, 9849091798.. ఎం ఆంజనేయులు, 9989898999 నంబర్లలో సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు.35 ఏళ్ల క్రితం విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు ఉద్యోగుల కోసం సీతమ్మధార ప్రాంతంలోని హెచ్‌బీ కాలనీలో 22.19 ఎకరాల విస్తీర్ణంలో 830 క్వార్టర్లు నిర్మించారు. కానీ స్టీల్‌ప్లాంట్‌కు 15 కిలోమీటర్ల దూరంలో ఈ ప్లాట్లు ఉండటంతో ఉద్యోగులు అక్కడ ఉండటానికి ఆసక్తి చూపించలేదు. ఈ క్వార్టర్లకు సరైన నిర్వహణ లేకపోవడంతో శిథిలమైపోయాయి. ప్రస్తుతం ఈ ప్లాట్లు ఉన్న ప్రాంతంలో భూముల ధరలు పెరిగాయి. అక్కడ గజం రూ.లక్షన్నర నుంచి రూ.2 లక్షలు పలుకుతోందని చెబుతున్నారు. గతంలో ఈ–వేలం ద్వారానే హెచ్‌బీ కాలనీలో కొన్ని ప్లాట్లు విక్రయించగా.. రూ.150 కోట్ల వరకు ఆదాయం వచ్చింది. ఇప్పుడు మరోసారి వేలానికి సిద్ధమవుతున్నారు. స్టీల్ ప్లాంట్ యాజమాన్యం విశాఖపట్నంలోని హెచ్‌బీ కాలనీ, ఆటోనగర్‌లో ఉన్న భూములు.. హైదరాబాద్, చెన్నై వంటి ప్రాంతాల్లో ఉన్న భూముల్ని విక్రయించేందుకు సిద్ధమైంది. కానీ ఈ భూముల విక్రయించొద్దంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ కోర్టులో పిల్ దాఖలు చేయడంతో స్టే విధించారు.. దీంతో కొన్నాళ్లు ఈ భూముల వేలం ప్రక్రియ ఆగిపోయింది.. మళ్లీ ఇప్పుడు మరోసారి భూముల వేలానికి సిద్ధమయ్యారు.

# ఆరణికి రాజకీయ ఇబ్బందులు

తిరుపతి, సెప్టెంబర్ 4,కొందరు పార్టీలు మారి ఎమ్మెల్యేలు కావచ్చు. అంత మాత్రాన పట్టున్న నియోజకవర్గంలో కాలరెగరేస్తే రాజకీయ భవిష్యత్ ఇబ్బందుల్లో పడే అవకాశముంది. ప్రస్తుతం జనసేన తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పరిస్థితి కూడా అలాగే ఉంది. తిరుపతి నియోజకవర్గంలోని జనసేన నేతలు, కార్యకర్తల నుంచి ఆయన వ్యతిరేకత ఎదుర్కొంటున్నారు. ఇక కూటమిలోని మిత్ర పక్షాలు కూడా ఆయనకు మద్దతుగా నిలిచే అవకాశం కనిపించడం లేదు. ఆయన తిరుపతి ఎమ్మెల్యే అయిన తర్వాత నియోజకవర్గాన్ని పట్టించుకోకపోవడంతో పాటు, తమను కూడా దూరం పెట్టడంతో కూటమిలోని మిత్ర పక్షాల నుంచి ఆరణికి రాజకీయ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆయనపై ఉన్న అసంతృప్తి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలపై పడే అవకాశముందన్న ఆందోళన జనసేన నేతల్లో ఉంది. స్థానిక క్యాడర్ నుంచి... తిరుపతి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుపై పార్టీ క్యాడర్, స్థానిక నాయకుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. జనసేన క్యాడర్‌ను పట్టించుకోకపోవడంతో పాటు అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ కార్యకర్తలను, సీనియర్లను ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.వైసీపీ నేతలతో సంబంధాలు కూడా ఆరణి శ్రీనివాసులుకు ఇబ్బందిగా మారాయంటున్నారు. కూటమి కార్యకర్తలను పక్కన పెట్టి, కొందరు వైసీపీ నేతలతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక మున్సిపల్ కార్పొరేషన్ వ్యవహారాలలో ఆరణి శ్రీనివాసులు ఎమ్మెల్యే బంధువులు, కుటుంబ సభ్యులు జోక్యం చేసుకోవడం వివాదాస్పదమైంది. ఇప్పటికే ఆరణి శ్రీనివాసులుపై సొంత పార్టీ నేతలే ఫిర్యాదు చేయడంతో సమన్వయంతో పనిచేయాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్వయంగా ఆయనకు సీరియస్ వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం. ఆరణి శ్రీనివాసులు వైసీపీ నుంచి జనసేనలోకి వచ్చారు. 2019 లో చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసీపీ తరుపున పోటీ చేసి విజయం సాధించారు. నాడు తిరుపతి ప్రాంతంలోని అనేక మంది వైసీపీ నేతలతో సంబంధాలున్నాయి. ప్రధానంగా భూమన కరుణాకర్ రెడ్డితో ఆయనకు సన్నిహిత్వం ఉందంటారు. అలాగే మరి కొందరు వైసీపీ నేతలను కూడా ఆయన దగ్గర తీస్తున్నారన్న ఆరోపణలున్నాయి. విపక్ష వైసీపీ చేసే విమర్శలకు కూడా ఆరణి శ్రీనివాసులు కౌంటర్ ఇవ్వకపోవడం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై విమర్శలు చేసినా చూసీచూడనట్లు వ్యవహరించడంతో పార్టీ నాయకత్వం కూడా ఆయన వ్యవహార శైలి పట్ల ఆగ్రహంగా ఉందని తెలుస్తోంది. వివాదాలు లేకపోయినా.. అనేక ఆరోపణలు ఆరణి శ్రీనివాసులును చుట్టుముడుతుండటంతో ఆయన రాజకీయంగా ఇబ్బందులలో పడినట్లేనని సొంత పార్టీ నేతలే చెబుతుండటం విశేషం.

# లక్కవరంలో ఘోర రోడ్డు ప్రమాదం..

## ఇద్దరు మృతి

అంబేద్కర్ కోనసీమ, మలికిపురంమలికిపురం మండలం లక్కవరం వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా.. మరో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం.స్థానికుల వివరాల ప్రకారం.. భీమవరం నుంచి లక్కవరంలోని ఓ వివాహ కార్యక్రమానికి హాజరై తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో కారు అదుపుతప్పి చెట్టును బలంగా ఢీకొట్టినట్లు స్థానికులు చెబుతున్నారు.ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు మహిళలను స్థానికులు, పోలీసులు సహాయంతో సమీపంలోని ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.మృతులు, క్షతగాత్రులు లక్కవరం గ్రామానికి చెందిన వారిగా గుర్తించినట్లు తెలుస్తోంది. అయితే ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు, మృతుల వివరాలు, ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు తెలియాల్సి ఉంది.ప్రమాదంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి , సెప్టెంబర్ 4:పాఠశాల విద్యాశాఖ, నంద్యాల జిల్లా ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించనున్నారు. ఉపాధ్యాయుల సేవలను స్మరించుకుంటూ నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరుకానున్నారు.నంద్యాల కలెక్టరేట్‌లోని పి.జి.ఆర్.ఎస్. హాల్‌లో శనివారం ఉదయం 10 గంటలకు వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులను సత్కరించడంతో పాటు విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర, బాధ్యతలపై కార్యక్రమంలో ప్రసంగాలు ఉండనున్నాయి.జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేడుకలకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పి. జనార్ధన్ రెడ్డి కోరారు.

## 15 వేల గాజులతో కామేశ్వరీ అమ్మవారు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 04-: మహానంది పుణ్యక్షేత్రంలో కొలువుదీరిన శ్రీ కామేశ్వరీ అమ్మవారికి శ్రావణమాసం నాలుగో శుక్రవారం సందర్భంగా వైభవంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్. శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో లోకకళ్యాణార్థం అమ్మవారిని ఏకంగా 15 వేల గాజులతో అత్యంత సుందరంగా అలంకరించారు.అమ్మవారికి గాజులతో చేసిన ప్రత్యేక అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి అమ్మవారికి మంగళహారతి సమర్పించారు. శ్రావణమాసం నాలుగో శుక్రవారం కావడంతో మహానంది క్షేత్రానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కామేశ్వరీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.అమ్మవారి దర్శనం, ప్రత్యేక అలంకరణను వీక్షించిన భక్తులు భక్తిపారవశ్యానికి లోనయ్యారు. ఆలయ అధికారులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. లోకకళ్యాణం, ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



## ఫిరోజ్‌కు శుభాకాంక్షల వెల్లువ--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 04-: నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్.ఎం.డి. ఫిరోజ్ జన్మదినం సందర్భంగా శుక్రవారం ఆయనకు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.శ్రీనివాస సెంటర్‌లోని సౌజన్య కాంప్లెక్స్‌లో ఉన్న ఐకాన్ జిమ్ సెంటర్ వద్ద వైఎస్ఆర్ నగర్ టీడీపీ 38వ వార్డు అధ్యక్షుడు, ఇన్‌చార్జ్ దేరెడ్డి శివనాగిరెడ్డి ఫిరోజ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఫిరోజ్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు.టీడీపీ బలోపేతానికి ఫిరోజ్ చేస్తున్న కృషి అభినందనీయమని శివనాగిరెడ్డి పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి, పార్టీ శ్రేణులకు మరింత అండగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఫిరోజ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



## పోస్టుకార్డు ఉద్యమం ఉధృతం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 4: ఆర్ఏఆర్ఎస్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక కలెక్టరేట్‌ను వెంటనే తరలించాలని, నూనెపల్లె మార్కెట్‌యార్డులో టీడీపీ కార్యాలయం కోసం కేటాయించిన రెండు ఎకరాల స్థలాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టిన పోస్టుకార్డు ఉద్యమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం గిరినాథ్ సెంటర్‌లో రెండో విడత కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు పోస్టుకార్డులపై తమ డిమాండ్లను రాసి ప్రభుత్వానికి పంపించారు. ఆర్ఏఆర్ఎస్‌లో కలెక్టరేట్ ఏర్పాటు చేయడం వల్ల వ్యవసాయ పరిశోధన కార్యకలాపాలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, మార్కెట్‌యార్డు స్థలాన్ని రాజకీయ పార్టీ కార్యాలయానికి కేటాయించడాన్ని రద్దు చేయాలని నాయకులు కోరారు.అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు ఏర్వ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కో-కన్వీనర్లు జానయ్య, మహేశ్వర్‌రెడ్డి, అడ్వకేట్ శంకరయ్య, విద్యార్థి నాయకులు రాంబాబు, ప్రొఫెసర్ శివరామిరెడ్డి, ఏజస్, బొజ్జా దశరథరామిరెడ్డి, పట్నం రాముడు తదితరులు పాల్గొన్నారు.



# ఎన్నికల సన్నద్ధత,

### భాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయంపై విస్తృత చర్చ

విజయవాడ, సెప్టెంబర్ 4 (న్యూస్ పల్స్)రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఎన్డీయే కూటమి సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో భాగస్వామ్య పక్షాల సమన్వయ కమిటీ కీలక సమావేశం నిర్వహించింది. ఎన్నికల వ్యూహాలు, క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన కార్యాచరణపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు.ఎన్నికల సన్నద్ధత, భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయం, నాయకులు-కార్యకర్తల మధ్య ఐక్యత వంటి అంశాలు ఈ భేటీలో ప్రధాన అజెండాగా ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థుల విజయాన్ని లక్ష్యంగా చేసుకుని పక్కా కార్యాచరణతో ముందుకు సాగాలని నాయకులు నిర్ణయించారు. గ్రామ, మండల స్థాయిలలో కూటమి నేతలంతా సమన్వయంతో పనిచేయాలని తీర్మానించారు.క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయించారు. భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసుకుని, ఐక్యంగా పనిచేయడం ద్వారా స్థానిక ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని నాయకులు పిలుపునిచ్చారు.వార్డుల డివిజన్ల ఖరారుధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లలో వార్డుల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియకు పురపాలక శాఖ డైరెక్టర్ షెడ్యూల్ విడుదల చేశారు. దీనికి సంబంధించి తక్షణమే ప్రతిపాదనలు పంపాలని అన్ని ప్రధాన కార్పొరేషన్లకు ఆదేశాలు జారీ చేశారు. 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుని ఈ వార్డుల పునర్విభజనను చేపట్టనున్నారని సమాచారం. ఈ ప్రతిపాదనలపై రేపటి నుంచి 7 రోజుల పాటు ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు స్వీకరించనున్నట్లు పురపాలక శాఖ తెలిపింది. ఆ తర్వాత పురపాలక డైరెక్టర్ పరిశీలించి ఆమోదం తెలిపిన అనంతరం సెప్టెంబర్ 13న డీలిమిటేషన్ వార్డుల తుది ప్రకటన వెలువడనుంది. మరుసటి రోజు, అంటే ఈ నెల 14న ఆంధ్రప్రదేశ్ అధికారిక గెజిట్‌లో వార్డుల పునర్విభజన ప్రకటనను ప్రచురిస్తారు. ఈ ఆదేశాలు జీవీఎంసీ (విశాఖపట్నం), విజయవాడ, మచిలీపట్నం, కర్నూలు, గుంటూరు, నెల్లూరు, ఒంగోలు, తిరుపతి, కడప, ఏలూరు, అనంతపురం, చిత్తూరు వంటి రాష్ట్రంలోని ప్రముఖ కార్పొరేషన్లన్నింటికీ వర్తిస్తాయని అధికారులు వెల్లడించారు.

39 పట్టణ స్థానిక సంస్థలలో వార్డుల పునర్విభజన పూర్తయ్యే కాలపరిమితి..

పార్వతీపురం: 03.09.2026 సాలూరు: 03.09.2026నర్సీపట్నం: 03.09.2026విజయవాడ: 03.09.2026 రామచంద్రపురం: 03.09.2026జగ్గయ్యపేట: 03.09.2026మాచర్ల: 03.09.2026వినుకొండ: 03.09.2026 సత్తెనపల్లి: 03.09.2026మార్కాపురం: 03.09.2026 చీరాల: 03.09.2026చిత్తూరు: 03.09.2026 అనంతపురం: 03.09.2026కర్నూలు: 03.09.2026ప్రొద్దుటూరు: 03.09.2026రాయచోటి: 03.09.2026 రాయదుర్గం: 03.09.2026పుట్టపర్తి: 03.09.2026బద్వేల్: 03.09.2026నగరి: 03.09.2026పుత్తూరు: 03.09.2026కదిరి: 03.09.2026ఎర్రగుంట్ల: 03.09.2026జమ్మలమడుగు: 03.09.2026పలమనేరు: 03.09.2026తిరుపతి: 03.09.2026జీవీఎంసీ (జివిఎంసి): 08.09.2026ఏలూరు: 08.09.2026మచిలీపట్నం: 08.09.2026పెడన: 08.09.2026పిఠాపురం: 08.09.2026ఒంగోలు: 08.09.2026చిలకలూరిపేట: 15.09.2026నెల్లూరు: 15.09.2026గుంటూరు: 08.09.2026కడప: 08.09.2026ధర్మవరం: 08.09.2026తాడిపత్రి: 08.09.2026నంద్యాల: 08.09.2026

## పిఠాపురం పాదగయలో సామూహిక వరలక్ష్మీ వ్రతం.. భారీగా తరలివచ్చిన మహిళా భక్తులు

కాకినాడ, సెప్టెంబర్ 04: నేడు వరలక్ష్మీ శ్రావణ శుక్రవారం ఆఖరి వారం. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లాలోని పిఠాపురంలో ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం పాదగయాలో కొలువుదీరిన శ్రీపురుహూతికా దేవి అమ్మవారి ఆలయానికి మహిళా భక్తులు పోటెత్తారు. భక్తి శ్రద్ధలతో వారంతా సామూహిక వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తున్నారు. దాదాపు 12 వేల మంది ఆడపడుచులు ఈ వ్రతంలో పాల్గొనున్నారు. ఈ వరలక్ష్మీ వ్రత పూజ కార్యక్రమంలో పాల్గొనే మహిళా భక్తులకు పసుపు, కుంకుమ, చీర, రూపుతో కూడిన కానుకను జనసేన నాయకులు అందించారు.అంతకుముందు ఈ దేవాలయంలో అమ్మవారికి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, పోలీస్ హౌసింగ్ బోర్డు చైర్మన్ కేకే పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ఈ పూజా కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెండెం దొరబాబు, తుమ్మలబాబు పాల్గొన్నారు. పిఠాపురం అసెంబ్లీ స్థానానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే.మరో వైపు చివరి శ్రావణ శుక్రవారం కావడం.. మహిళా భక్తులు పోటెత్తనుండంతో.. ఆలయ అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. ఈ వ్రతం ఆచరించడానికి వచ్చే మహిళలను ఐదు బ్యాచ్‌లుగా ఆలయ అధికారులు విభజించారు. ఈ పాదగయ క్షేత్రం.. అష్టాదశ శక్తి పీఠాలలో పదవదిగా విరాజిల్లుతున్న సంగతి తెలిసిందే.





## నిమజ్జనానికి చెరువులో నీరు--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 04-: వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా నంద్యాల చెరువులో నీటిని నిల్వ చేసినట్లు అధికారులు తెలిపారు. నిమజ్జన ప్రాంతంలో పారిశుధ్య ఏర్పాట్లపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.శుక్రవారం మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న చెరువు కట్ట వద్ద జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. చెత్తాచెదారం తొలగింపు, పారిశుధ్య నిర్వహణతో పాటు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు.కమిషనర్ వెంట మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, శానిటేషన్ సూపర్‌వైజర్లు మురళీధర్, శివ ప్రసాద్ రెడ్డితో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ఫిరోజ్ జన్మదిన వేడుకలు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 4: టీడీపీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి ఫిరోజ్‌కు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో సర్వమత ప్రార్థనలు జరిగాయి. తన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించిన పార్టీ శ్రేణులకు ఫిరోజ్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

## సత్వర స్పందన.. బాధితుడికి న్యాయం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 4: ఆన్‌లైన్‌లో ద్విచక్ర వాహనం కొనుగోలు వ్యవహారంలో పోలీసులు సత్వరంగా స్పందించి బాధితుడికి న్యాయం చేశారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సత్యం పాండే, సంజామల మండలం ఆల్వకొండకు చెందిన గిరి హుస్సేన్‌తో రూ.40 వేలుకు వాహనం కొనుగోలుకు ఒప్పందం చేసుకుని, ముందుగా రూ.30 వేలు చెల్లించాడు.మిగిలిన రూ.10 వేలు చెల్లిస్తే వాహనం పంపుతానని చెప్పిన హుస్సేన్ అదనంగా రూ.20 వేలు కోరడంతో సత్యం పాండే పోలీసులను ఆశ్రయించాడు. స్పందించిన సంజామల ఎస్ఐ రమణయ్య, కోయిలకుంట్ల సీఐ హనుమంతు నాయక్ ఇరువర్గాలను పిలిపించి సమస్యను పరిష్కరించారు. అంగీకరించిన ప్రకారం రూ.10 వేలు చెల్లించడంతో హుస్సేన్ వాహనాన్ని అప్పగించాడు. భాషా సమస్యను సైతం పోలీసులు పరిష్కరించారు. పోలీసుల సత్వర స్పందనపై సత్యం పాండే కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజా సమస్యలపై మంత్రి ఫరూక్ దృష్టి--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 04: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. శుక్రవారం నంద్యాలలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను మంత్రి స్వయంగా స్వీకరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, సమస్యలను జాప్యం లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని మంత్రి తెలిపారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190